# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 220
పేజీలు : 06 | వెల: రూ.5/-
శనివారం
మే 31, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




6లో..

## నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

- పోలీసు, వ్యవసాయ శాఖల అధికారుల హెచ్చరిక



2లో..

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుదాం

- ఉద్యమాలతో కార్మికుల హక్కులు సాధించుకుందాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్




6లో..

## మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరం

- దేశ సంపద అంబానీ, ఆదానీల వద్ద కేంద్రీకృతం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




# బడికి వేళాయే..



- త్వరలో ప్రారంభం కానున్న స్కూళ్లు
- సర్కారీ బడుల్లో సదుపాయాలు కరువు
- ప్రైవేటు స్కూళ్లతో తల్లిదండ్రులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- కొరవడిన నిఘా

ఈ ఏడాది జూన్ నెల 12న వేసవి సెలవుల తరవాత ప్రారంభం కానున్నాయి. దీంతో ఇప్పటి నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ఫీజుల, విద్యా సామగ్రి గురించి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పిల్లలు ప్రస్తుతం చదువుతున్న పాఠశాలల్లోనే ఉంచాలా లేక వేరే స్కూల్లో చేర్పించాలా, ఒకవేళ స్కూల్ మారిస్తే అక్కడ ఉండే పరిస్థితుల ఆరా తీయడం జరుగుతుంది. ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తే ఫీజుల భారం, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే అధికారుల, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం గురించి ఆందోళన చెందుతున్నారు. – వరంగల్ వాయిస్, తొర్రూరు

వివరాలు2లో..




## శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీస్ కవాతు

పరకాల డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో పరకాల మండల కేంద్రంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు చేపట్టారు. ఏసీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్ని జెండా ఊపి కవాతు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. – వరంగల్ వాయిస్, పరకాల



6లో..

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

జూన్ 6 నాటికి నిర్మాణాలు ప్రారంభం కావాలి | హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

# బడికి వేళాయే..

- త్వరలో ప్రారంభం కానున్న స్కూళ్లు
- సర్కారీ బడుల్లో సదుపాయాలు కరువు
- ప్రైవేటు స్కూళ్లతో తల్లిదండ్రులకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- కొరవడిన నిఘా



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** ఈ ఏడాది జూన్ నెల 12న వేసవి సెలవుల తరవాత ప్రారంభం కానున్నాయి. దీంతో ఇప్పటి నుంచే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ఫీజుల, విద్యా సామగ్రి గురించి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పిల్లలు ప్రస్తుతం చదువుతున్న పాఠశాలల్లోనే ఉంచాలా లేక వేరే స్కూల్లో చేర్పించాలా, ఒకవేళ స్కూల్ మారిస్తే అక్కడ ఉండే పరిస్థితుల ఆరా తీయడం జరుగుతుంది. ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తే ఫీజుల భారం, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే అధికారుల, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం గురించి ఆందోళన చెందుతున్నారు.

## సర్కారీ బడుల్లో సదుపాయాలు కరువు..

ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి విచిత్రంగా తయారైంది. ఉపాధ్యాయులు సరిగ్గా ఉంటే సదుపాయాలు ఉండడం లేదు. అన్ని వసతులు ఉన్న చోట టీచర్లు ఇష్టారీతిన వ్యవహరిస్తూ సరిగ్గా విధులు నిర్వర్తించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. చాలా మంది ఉపాధ్యాయులు వరంగల్, హనుమకొండ కాజీపేట లాంటి నగరాల నుంచితండాలు, గ్రామాల్లోని పాఠశాలలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో సమయ పాలన లేకుండా పోతుందని, దీనిని నివారించాలని పలువురు కోరుతున్నారు. ప్రతీ స్కుల్లో బయో మెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలని స్థానికులు, యువకులు డిమాండ్ చేస్తున్నారు. టీచర్లు పనిచేసే చోటుకు సమీప ప్రాంతాల్లో ఉంటున్న ఉపాధ్యాయులు కూడా విధులకు సరిగ్గా రావడం లేదని ప్రజలు అంటున్నారు. మండల, జిల్లా విద్యాశాఖాధికారులు ఉదాసీనంగా వ్యవహరించడతోనే టీచర్లు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారని యువకులు అభిప్రాయపడుతున్నారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు, టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం లేక ఉపాధ్యాయులు, వారితో పాటు విద్యార్థులు కూడా అనేక అవస్థలు పడుతున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలని, ప్రభుత్వ విద్యపై శీత కన్ను వీడాలని కోరుతున్నారు.

## ప్రైవేట్ జులుం..

దిగువ మధ్యతరగతి, పేదవారు ప్రైవేట్ స్కూళ్లంటనే జంకుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించలేక, ప్రైవేట్ స్కుల్లలో చదివించలేక వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ స్కూళ్ళలో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో వారి సంపాదన సగానికి పైగా పిల్లల ఫీజుల కోసమే వెచ్చించాల్సిన పరిస్థితి. బహిరంగ మార్కెట్లో అందుబాటులో ఉన్న వస్తువులు, విద్యా సామగ్రి కూడా సదరు విద్యార్థులు చదివే పాఠశాలల్లోనే అమ్ముతుండడతో విద్యార్థుల తల్లిదండ్రులు పడే అవస్థలు వర్ణనాతీతం. ప్రైవేట్ స్కూళ్ళలో యధేచ్ఛగా జరుగనున్న ఫీజుల దందా గురించి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కోరుతున్నారు. ఆ పాఠశాలల్లోనే అన్ని వస్తువుల అమ్మకాలు జరగకుండా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, పుస్తకాలు, యూనిఫారం అమ్మకుండా చర్య తీసుకోవాలని తల్లితండ్రులు కోరుతున్నారు. మరీ ముఖ్యంగా ప్రైవేట్ స్కూళ్ళలో ఉన్న బస్సుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రవాణా, పోలీస్ శాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతోన్న స్కూల్ యాజమాన్యాలపై కొరడా ఝులిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

### విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయాలి: వేల్పుల సంపత్, కంటాయపాలెం



నేటి విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయడానికి పాలకులు, అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలి. సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధముగా బయో మెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలి. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చేపట్టాలి. ఇష్టారీతిన వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల జేబులు గుల్ల చేస్తున్న వాటిపై నియంత్రణ లేకపోవడంతో వారు అనేక అవస్థలు పడుతున్నారు.విద్యాశాఖలో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి.

# అటు బడి'బాట'.. ఇటు సర్దు'బాట'నా..?

- విద్యార్థుల సంఖ్య పెరిగితే ఎలా..?
- సర్దుబాటు గడువును పొడిగించాలి
- బీసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** నానాటికి విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని.. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది అని పేర్కొంటూ వేసవి సెలవుల్లో కెపాసిటీ బిల్డింగ్ పేరుతో టీచర్లకు శిక్షణ ఇచ్చిన ప్రభుత్వం.. ఆ శిక్షణ లక్ష్యాలను దెబ్బతీసే విధంగా జారీ చేసిన టీచర్ల సర్దుబాటు గడువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ టీచర్స్ యూనియన్ (బీసీటీయూ) వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్ లో శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఒకవైపు విద్యార్థుల సంఖ్యను పెంచమంటూ.. మరోవైపు టీచర్ల సర్దుబాటు జూన్ 12న పాఠశాలలు తెరిచేలోపే పూర్తి చేయాలని ఆదేశించడం ఏమిటి అని ప్రశ్నించారు. జూన్ 6 నుంచి బడిబాట నిర్వహించి.. విద్యార్థుల సంఖ్య పెంచాలనే ఆదేశాలకు భిన్నంగా ఈ సర్దుబాటు ఉత్తర్వులు ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. బడిబాట ద్వారా విద్యార్థుల సంఖ్య పెరిగితే.. మళ్లీ టీచర్ల కొరతతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడిబాట పూర్తయి.. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం విద్యార్థులు ఉన్న బడులను కాపాడుకునే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు. గతంలో ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు కూడా బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడానికి కారణమైందని ఆరోపించారు. సర్కార్ బడుల్లో టీచర్లు సరిగా ఉండరనే ప్రచారం ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసే విధంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న బడుల్లో తక్కువ మంది టీచర్లు.. విద్యార్థులు తక్కువ మంది ఉన్న బడుల్లో ఎక్కువమంది టీచర్లు ఉండకుండా చూడాల్సిన బాధ్యత పర్యవేక్షణ అధికారులపై ఉందన్నారు. టీచర్ల సర్దుబాటు గడువును పెంచేలా మరో ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



# పాఠ్యపుస్తకాల విక్రయాలను అరికట్టాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడిని అరికట్టాలని పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు స్టేషనరీ లను విక్రయించడానికి అరికట్టాలని కోరుతూ ఏఐఎస్ బీ ఆధ్వర్యంలో వరంగల్, ఖిల్లా వరంగల్ ఎంఈఓ గంప అశోక్, బత్తుల ప్రసాద్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ బీ నాయకులు మాట్లాడుతూ వరంగల్, ఖిల్లా వరంగల్ పరిధిలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తూ, ఈ టెక్నో , డీజీ, ప్రైమ్ తదితర తోక పేర్లతో ప్రజలను మభ్యపెడుతూ పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు స్టేషనరీ వస్తువులు, డ్రెస్సులు విక్రయిస్తూ విద్యార్థులను విలువ దోపిడీ చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇలాంటి స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎడ్ బీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రేహాన్, నవీన్ , సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచుదాం

- ఉద్యమాలతో కార్మికుల హక్కులు సాధించుకుందాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ**:కార్మికుల సంక్షేమాన్ని కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ మండి పడ్డారు.దేశంలోనూ రాష్ట్రంలోనూ కార్మికుల హక్కుల సాధన కోసం ప్రభుత్వాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్మిక మాసోత్సవాల్లో భాగంగా బాల సముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్మృతివనం ఏకశిలా పార్కు వద్ద వివిధ కార్మిక సంఘాలతో కలిసి దాస్యం వినయ్ భాస్కర్ నేతృత్వంలో ధర్నా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కార్మికులు ఎదుర్కొంటోన్న వివిధ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్న ఉద్దేశంతోనే ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 9న దేశ వ్యాప్తంగా జరుగుతోన్న సార్వత్రిక సమ్మెలో ప్రతీ ఒక్క కార్మిక సంఘం..ప్రతీ కార్మికుడూ పాల్గొని దాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, కార్యక్రమ కన్వీనర్ నాయిని రవి ఎంజాల మల్లేశం, ఈసంపల్లి సంజీవ, రవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి,జయరాం, తేలు సారంగపాణి, రఘుపతి రెడ్డి, శివకుమార్, కాటపురపు రాజు, రాజారపు రాజు, బిక్షపతి, రఘు, కృష్ణ, రాజు, ఎండీ ఇస్మాయిల్, గుంజ స్వామి, కొండయ్య రవి, మా తెలంగాణ ఆటో యూనియన్ నాయకులు ప్రతాపరుద్ర ఆటో యూనియన్ నాయకులు భవన నిర్మాణ రంగ 14రంగాల నాయకులు చిరు వ్యాపారులు,పెద్ద ఎత్తున కార్మిక నాయకులు కార్మికులు హాజరయ్యారు.



# అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

◆ వాకింగ్ ట్రాక్ పనులను ప్రారంభించిన ప్రణవ్

**వరంగల్ వాయిస్, హుజురాబాద్ :** హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని పదవి ఉన్నా లేకపోయినా రాజకీయాల కంటే హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికే విలువ ఇస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం హుజురాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో వాకింగ్ చేసే వాకర్స్ కి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు పది లక్షల విలువ చేసే వాకింగ్ ట్రాక్ , గేట్ పనులను ఆయన కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏళ్లుగా ఎదురుచూస్తున్న పనులకు మోక్షం లభిస్తుందని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మరోసారి రుజువు అయిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి, జిల్లాకు సంబంధించిన మంత్రుల సహకారంతో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని, 10 నెలల క్రితం ఇక్కడికి వచ్చినప్పుడు ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ప్రారంభించామని, రాజకీయాలకు అతీతంగా హుజురాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

**దళిత ద్రోహి కౌశిక్ రెడ్డి..**

దళిత బంధు విషయంలో మొసలి కన్నీరు కారుస్తున్న కౌశిక్ రెడ్డి దళిత ద్రోహి అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ అన్నారు. గతంలో చెప్పినట్టుగా చంపినోడే సంతాపం తెలిపినట్టు దళిత బంధు నిధులను అడ్డుకున్నది కౌశిక్ రెడ్డే అని, ఓట్ల కోసం తప్ప దళితుల అభ్యున్నతికి ఏ రోజు పాటు పడలేదని అన్నారు.కౌశిక్ రెడ్డి విషయంలో ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారని తను సోషల్ మీడియాలో రీల్స్ చేసుకునే ఎమ్మెల్యే తప్ప ప్రజలు కష్టాలు తీర్చే ఎమ్మెల్యే కాదని అన్నారు. దళితుల పట్ల నిజమైన ప్రేమ కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. దళిత బంధు పథకం విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిధుల ప్రక్రియ ప్రారంభం అయిందని,ఎలాంటి కమీషన్ లకు తావు లేకుండా పకడ్బందీగా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం అందజేస్తామన్నారు.

# బక్రీద్ ను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

◆ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి





**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోదర భావంతో శాంతియుత వా తా వ ర ణం లో జరుపుకోవాలని రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎడవెల్లి శ్రీనివాసరెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలోని రఘునాథపల్లి, లింగాల గణపురం, చిల్పూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని .. ఆ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ప్రజలంతా పండుగను మత సామరస్యంతో జరుపుకునే విధంగా ఉండాలన్నారు. ప్రతి పండుగను ఈ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే సమస్య పరిష్కారానికి పోలీసులను కలవాలని కోరారు. ముఖ్యంగా యువత ఆవేశంతో చేస్తున్న చిన్న చిన్న తప్పులు శాంతి భద్రతల సమస్యగా తలెత్తే ప్రమాదం ఉంటుందని కాబట్టి, మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా విద్వేషాలు రెచ్చగొట్టే ఆసత్యకర పోస్టులు పెట్టడం ద్వారా శాంతిభద్రతల సమస్య సృష్టించే ప్రయత్నం చేసే వారిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



# మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం పరిశీలన

**వరంగల్ వాయిస్,దామెర:** మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో ఏర్పాటు చేస్తున్న మహిళా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని శనివారం అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.ల్యాదల్లలో సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల రూరల్ &టౌన్ మహిళలకు అందుబాటులో ఉంటుందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ప్రతి ఇంట్లో ఒకరికి ఉపాధి అవకాశాలు పొందుతారని, త్వరలో దామెర మండల కేంద్రంలో డైరీ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బిల్లా రమణారెడ్డి, భిక్షపతి, ప్రకాష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రవీందర్, రాజేష్, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారిని ఆశీర్వదించిన బీజేపీ నేతలు

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పసరుగొండ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు మేడిపల్లి ఉమ–సుధాకర్ కూతురు హారిక నూతన వస్త్ర ఫల పుష్పలంకరణ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్, మంద రమేష్ గురిజాల శ్రీరామ్ రెడ్డి, వీసం రమణారెడ్డి, ముత్యాల శ్రీనివాస్, సూర చందర్, గొట్టే రాజు, తీగుళ్ల శ్రీనివాస్, మేడిపల్లి శ్రీనివాస్, శనిగరం దేవేందర్, మేడిపల్లి శ్రీకాంత్, చెక్క రాజు, శనిగరం రమేష్, కందుగుల భిక్షపతి , మొలుగురు శ్రీనివాస్, భూక్య వెంకన్న, బత్తుల సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని గుగ్గులోత్ తండాలో మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో డా.కన్నబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన భారతీయ చిరుధాన్యాల పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమం పీవీ నరసింహ రావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా డా.కన్నబాబు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న జనాభా వల్ల ఆహార సరఫరాపై ఒత్తిడి పెరుగుతుందని, ఈ అవసరాలను తీర్చేందుకు అధిక దిగుబడుల కోసం రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగిస్తున్నారని తెలిపారు. ఇది నేల నాణ్యతను హరించి, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవుల మరణానికి దారి తీస్తుందని, దీంతో తెగుళ్ల తీవ్రత కూడా పెరుగుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పకృతి వ్యవసాయం మేల్కొలుపు ఇస్తుందని, తక్కువ పెట్టుబడితో ప్రకృతిలో లభించే జీవామృతం, బీజామృతం, కషాయాలు వంటివి వాడటం ద్వారా పంట దిగుబడులు పెరగడమే కాక, భూసారం మెరుగవుతుందని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కూడా ఇది దోహదపడుతుందన్నారు. ఇందులో చిరుధాన్యాలు కీలకపాత్ర వహిస్తున్నాయని, అవి ఆరోగ్యానికి మేలు చేయడమే కాక, తక్కువ నీటి వినియోగంతో సాగు చేయవచ్చునని రైతులకు వివరించారు. ఈ విధంగా రైతుల ఖర్చులు తగ్గి, నికర ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ మెట్టపంటల శాస్త్రవేత్త నిర్మల, కేవికే శాస్త్రవేత్తలు సౌమ్య, హర్ష, మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్, అనేకమంది రైతులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి మేము సైతం అంటూ ప్రజల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సేవ సంస్థల సేవలు అభినందనీయమని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎడవల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం రఘునాథపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పొట్లపల్లి కమల మనోహర్ రావు ఫౌండేషన్ అశ్వరావు పల్లి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్యూరిఫైర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బస్టాండ్ సమీపంలో ప్రయాణికులకు ప్రజలకు మంచినీటి సరఫరా చేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ యజమాని పొట్లపల్లి కళాధర్ రావు, జనగామ డిపో మేనేజర్ స్వాతి, కుర్ర సురేందర్ గౌడ్, సంస్థ ప్రతినిధి రవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు కావటి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.




# మెడికేర్ లో పొగాకు నియంత్రణ కేంద్రం ప్రారంభం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ పొగాకు నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, వరంగల్‌లోని మెడికేర్ జనరల్ హాస్పిటల్ లో పొగాకు నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వరంగల్ మేత్రాసన పాలనాధికారి ఫాదర్ విజయపాల్ రెడ్డి, హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ జి.చిన్నప్ప రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ, "ఏటా లక్షలమంది ప్రాణాలు తీస్తున్న పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ప్రారంభించాం. ఈ రోజు నుంచి ప్రతి పేషెంట్‌కు రూ.4,500 విలువైన ల్యాబ్ పరీక్షలను ఉచితంగా అందించనున్నామని తెలిపారు. హాస్పిటల్ డైరెక్టర్ ఫాదర్ జి.చిన్నప్ప రెడ్డి మాట్లాడుతూ "ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాల ప్రకారం పొగాకు వాడకం కారణంగా ప్రతి ఏడాది సుమారు 80లక్షల మంది మరణిస్తున్నారు. వీరిలో 13 లక్షల మంది నేరుగా ధూమపానం చేయకపోయినా, పరోక్షంగా పొగ పీల్చడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పొగాకు వినియోగాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎఫ్ సీఐఎంఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేందర్ రెడ్డి, సిస్టర్ పుష్పా, డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ బావని, డాక్టర్ నరేష్, డాక్టర్ వెంకటేశ్వర్లు, అదేవిధంగా, హాస్పిటల్ పేషెంట్ కోఆర్డినేషన్ టీం సభ్యులు విజయ్, రవీందర్, కార్తీక్, వినయ్, జాన్, సందీప్ పాల్గొన్నారు.

# పొగాకుకు దూరంగా ఉందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం

◆ **టొబాకో పై అవగాహన ర్యాలీ**




**వరంగల్ వాయిస్, ములుగు:** తెలంగాణ రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కమిషనర్ ఆదేశాల మేరకు, ములుగు జిల్లాలో ప్రపంచ నో టొబాకో దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ములుగు ప్రధాన ప్రభుత్వాసుపత్రి నుంచి బస్టాండ్ వరకు నిర్వహించగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "పొగాకు, దాని ఉత్పత్తులు గుట్కా, తంబాకు, సిగరెట్, బీడీల వాడకాన్ని తగ్గించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. భారతదేశంలో ఏటా మూడు లక్షల పైచిలుకు మరణాలు కేవలం పొగ త్రాగడం వలన జరుగుతున్నాయి," అని తెలిపారు. ర్యాలీలో "పొగాకు దూరంగా ఉందాం – ఆరోగ్యంగా జీవిద్దాం", "గుట్కా తినొద్దు – ఆరోగ్యాన్ని కాపాడుకుందాం", "పొగాకు వాడొద్దు – క్యాన్సర్‌కు గురికావొద్దు" వంటి నినాదాలు వినిపించాయి. ప్రజలకు ఈ హానికర పదార్థాల గురించి అవగాహన కల్పిస్తూ, పొగాకు విరుద్ధంగా ఉద్యమించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగ్ అన్వేష్, డెమో సంపత్, డీపీఎంఓ సాంబయ్య, ఎన్సీడీ కోఆర్డినేటర్లు వెంకట్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు, రాయినిగూడెం, వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొగాకు రహిత జీవితంపై అవగాహన అవసరం




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** "ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం" సందర్భంగా, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థలు సంయుక్తంగా అవగాహన సదస్సును న్యాయ సేవా సదన్ భవనంలో నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా ఇంచార్జ్ ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ట్రిబ్యునల్ కోర్టు న్యాయమూర్తి నారాయణ బాబు, న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస శ్రీధర్, హనుమకొండ వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఏ.అప్పయ్య, మెడికల్ ఆఫీసర్లు డా.మోహన్ సింగ్, డా.శ్రీనివాస్, పల్మనాలజిస్ట్ డా.పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ మాట్లాడుతూ పొగాకు కేవలం వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా పర్యావరణాన్ని కూడా హానికరంగా ప్రభావితం చేస్తుందని తెలిపారు. పొగాకు వినియోగదారులలో అవగాహన పెంచడం, దాని వినియోగాన్ని మానేయడానికి సహాయపడే చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. అలాగే, పొగాకు మీద కోరికను అధిగమించేందుకు వ్యాయామం, యోగా, సంగీతం వంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించవచ్చని సూచించారు. హనుమకొండ జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవి మాట్లాడుతూ పొగాకు వినియోగం వల్ల గుండె, ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుందని, ధూమపానం గుండెపోటుల ప్రధాన కారణాలలో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత పొగాకు దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ అవగాహన కార్యక్రమం చివర్లో, న్యాయమూర్తులు మరియు హాజరైన ప్రతి ఒక్కరూ "పొగాకు రహిత జీవితం" పట్ల నిబద్ధతగా ఉండేందుకు ప్రతిజ్ఞ చేయించారు.




# పొగాకు నియంత్రణ ప్రతిజ్ఞ

**వరంగల్ వాయిస్, వరంగల్:** లాల్ బహదూర్ కళాశాల ఎన్సీసీ ఆర్మీ విభాగం, 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో పొగాకు నియంత్రణ దినోత్సవం ( నో టొబాకో డే) ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.అరుణ డీ.హెచ్.రావు మాట్లాడుతూ దేశంలో లక్షలాది మంది ధూమపానం, సిగరెట్లు, బీడీలు, పొగాకు ఉత్పత్తుల వినియోగం కారణంగా క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడం అత్యంత అవసరమని, ఈ నేపథ్యంలో విద్యార్థులు పొగాకు నియంత్రణ ప్రతిజ్ఞ తీసుకొని, కళాశాల నుంచి ములుగు రోడ్డు కూడలి మీదుగా కెఎంసీ వరకు జాగృతి ర్యాలీ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డా.ఎం.సదానందం, భాగ్యలక్ష్మి, జూనియర్ అండర్ ఆఫీసర్ వెన్నెల, సాయి గణేష్, శివాని ఆర్.ఎ, సాహిత్య, సోహైల్, హాస్య బేగం, రష్మిత, మనూష్య, లోకేష్, శ్రీనివాస్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# బండారి చిరంజీవి ఆశయ సాధనకై ఉద్యమించాలి

◆ **మద్ది కాయల అశోక్ ఓంకార్**

**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని తక్కళ్లపహాడ్ లో అమరజీవి కామ్రేడ్ బండారి చిరంజీవి స్థూపాన్ని ఎంసీపీఐ(యూ) పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్ ఆవిష్కరించారు. అమరజీవి బండారి చిరంజీవి చిత్రపటాన్ని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి ఆవిష్కరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాద గోని రవి గారు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంసీపిఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ బండారి చిరంజీవి మలీదశ తెలంగాణ ఉద్యమంలో వరంగల్ జిల్లా జేఏసీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించి వరంగల్ జిల్లా కో కన్వీనర్ గా పనిచేశారన్నారు. ఈ ఆవిష్కరణ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దారపు రమేష్, మంద రవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్, ములుగు జిల్లా కార్యదర్శి గుండె బోయినా చంద్రయ్య, అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి, రాష్ట్ర కమిటీ సభ్యులు కర్ర రాజిరెడ్డి, కుసుంబా బాబూరావు , జిల్లా కమిటీ సభ్యులు ఒక్కల కిషన్, ప్రభాకర్ రావు, మొగిలి శ్రీనివాసరావు, రాజసాహెబ్, కొత్తకొండ రాజమౌళి, ఐతం నగేష్, అప్పనపురీ నర్సయ్య, మాలి ప్రభాకర్, ఎండీ ఇస్మాయిల్, లక్కిడి దేవేందర్ రెడ్డి, కొత్తపల్లి చిరంజీవి, ఉడుతల గణేష్, అన్నబోయిన ప్రేమలత, మట్టెడ మొగిలి, భిక్షపతి, సారా కిషన్, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దేశినేని హనుమంతరావు మృతిపై కడియం దిగ్భ్రాంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశినేని హనుమంతరావు లాంటి ప్రాణ స్నేహితుణ్ణి కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఆయన మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. హనుమంతరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ విషాద సమయంలో వారికీ మనోధైర్యాన్ని ప్రసాదించాలని, హనుమంతరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, మే 31, 2025



# మిత్రుడి కుటుంబానికి చేయూత

**వరంగల్ వాయిస్, దామెర :** హనుమకొండ జిల్లా అయినవోలు మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో స్ఫూర్తిదాయక మానవతా చైతన్యం చోటు చేసుకుంది. స్థానికంగా నివాసముండే 2005–06 బ్యాచ్‌కు చెందిన మిత్రుడు బండి అనిల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల సంతాపాన్ని ప్రకటించిన తోటి స్నేహితులు, అనిల్ కుటుంబానికి ఆర్థికంగా చేయూతనిచ్చారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో అనిల్ కుటుంబానికి రూ.30,000 నగదు, 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఇది కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాక, స్నేహితుల మధ్య ఉన్న బంధానికి నిదర్శనంగా నిలిచింది.

# ఘనంగా బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల ప్రారంభం



- బ్యాడ్మింటన్ ఆడి సందడి చేసిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకు అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం బాల్ బ్యాడ్మింటన్ కోర్టు వద్ద ఎమ్మెల్యే టెంకాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఎమ్మెల్యే పరిచయం చేసుకున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి పెంపొందించడమే కాకుండా మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయని అన్నారు.ఈ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. అంతకుముందు ఎమ్మెల్యే కొద్దిసేపు బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ఆడి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే జీఎస్సార్



**వరంగల్ వాయిస్, గోరి కొత్తపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గం కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడెపాక గ్రామంలో శ్రీ భూలక్ష్మి బొడ్రాయి ప్రతిష్టాపన మహోత్సవంలో శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు బొడ్రాయి కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నేతలు శాలువాలు కప్పి డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. అనంతరం యాగశాల, బొడ్రాయి వద్ద టెంకాయ కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. చిన్నకోడెపాక గ్రామ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# మాకు న్యాయం చేయండి

- బాధితుల నిరాహార దీక్ష
- ఎలుకుర్తి (హవేలీ)లో తల్లితో కలిసి యువకుడి పోరాటం




**వరంగల్ వాయిస్, గీసుగొండ :** వంశపారంపర్యంగా తన తండ్రి నుంచి తనకు రావలసిన ఆస్తి వాటా కోసం ఓ కుమారుడు న్యాయ పోరాటం చేస్తున్నాడు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఎలుకుర్తి (హవేలీ) గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ 17 ఏళ్ల క్రితం మృతి చెందారు. ఆయన కుమారుడైన మిట్టపల్లి అరవింద్ తన తల్లితో కలిసి ఇన్నాళ్లు తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నాడు. అయితే, ఈ సమయంలో తన నానమ్మ బాగోగుల నిమిత్తం ఊరికి వచ్చి పోతూ ఉండేవాడు. అరవింద్ మేజర్ (18 ఏళ్లు) కాగానే ఆస్తిలో వాటా ఇస్తానని అరవింద్ నానమ్మ చెబుతూ ఉండేదని వెల్లడించారు. అరవింద్ నానమ్మ ఇటీవల మృతి చెందగా, అప్పటి నుంచి తన ఆస్తి వాటా కోసం వ్యవసాయ భూమి ఇంటి వద్దకు వెళ్లగా, తన పెద్దనాన్న కరుణాకర్, బాబాయ్ రాజు.. గొడవకు దిగుతున్నారని పేర్కొన్నారు. “ఆస్తిలో వాటా లేదు “ అని హెచ్చరిస్తున్నారని వెల్లడించారు. న్యాయంగా తనకు రావలసిన ఆస్తి వాటాను ఇప్పించాలని బాధితుడు అరవింద్ గ్రామస్తులు, పెద్ద మనుషులను వేడుకుంటున్నాడు. ఆస్తి విషయమై తాను పెద్ద మనుషుల మధ్యకు పిలిపించినా, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా.. తన పెదనాన్న, బాబాయ్ రావడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొందరు మాట్లాడుతూ న్యాయంగా మిట్టపల్లి వంశాన్ని మోస్తున్న అరవింద్ కు వాటా ఇవ్వాల్సిందేనని అభిప్రాయపడ్డారు. మిట్టపల్లి శ్రీనివాస్ మరణించిన సందర్భంలో ఆమె భార్య కడుపులో మూడు నెలల బాలుడిగా ఉన్న అరవింద్ తన నానమ్మ మాటలు నమ్మి ఆస్తి వస్తుందని చిన్నప్పటి నుంచి వేచి చూస్తున్నాడని.. కానీ ఇప్పుడు ఆస్తి లేదని ఇవ్వబోమని, అరవింద్ పెదనాన్న, బాబాయ్ పేర్కొన్నడం సరికాదని మండిపడుతున్నారు.



# తాళ్లపెల్లి నరేష్ గౌడ్ కు డాక్టరేట్

**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ విభాగ పరిశోధకుడు తాళ్లపెల్లి నరేష్ గౌడ్ కు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. స్టేట్ ఆండ్ రూరల్ డెవలప్మెంట్ –ఏ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం పై విభాగ ఆచార్య ప్రొఫెసర్ పోరిక సమ్మూలాల్ పర్యవేక్షణ లో పూర్తి చేశారు. షాపల్లి గ్రామం, జఫర్ గడ్ మండలం, జనగామ జిల్లాకు చెందిన డాక్టర్ తాళ్లపెల్లి నరేష్ గౌడ్ ను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.



# మంటలార్పిన మడికొండ పోలీసులు

**వరంగల్ వాయిస్, మడికొండ:** మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో శనివారం ఒక ప్రమాదం సంభవించింది. స్థానికంగా నివసించే జన్ను అనసూర్య శామ్యూల్ అనే వృద్ధ మహిళ తన ఇంట్లో దేవుడికి దీపం వెలిగించి ఉండగా, ప్రమాదవశాత్తు దీపం పక్కన ఉన్న సామాన్లకు అంటుకోవడంతో మంటలు అంటుకున్నాయి. ఇల్లు దగ్ధమవుతున్న దృశ్యం చూసిన స్థానికులు తక్షణమే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న మడికొండ ఇన్స్పెక్టర్ కిషన్ తన సిబ్బందితో కలిసి వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో ఉన్న వృద్ధురాలిని సురక్షితంగా బయటకు తీసుకురావడమే కాక, మంటలను అదుపులోకి తెచ్చేందుకు చురుకుగా వ్యవహరించారు. పోలీసుల వేగవంతమైన స్పందనతో పెద్ద ప్రమాదం తప్పింది. వారి సత్వర చర్యను చూసిన స్థానికులు ఇన్స్పెక్టర్ కిషన్, ఎస్ఐ రాజ్ కుమార్, సిబ్బందిని హృదయపూర్వకంగా అభినందించారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

శనివారం, మే 31, 2025



# కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్వాతంత్ర పోరాట యోధులు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమ నాయకులు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని కోరుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ నేత ఆధ్వర్యంలో వరంగల్ పద్మశాలి భవన్ చార్ బౌలి లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడ రాపోలు జ్ఞానేశ్వర్ పాల్గొని మాట్లాడుతూ మూడు తరాల ఉద్యమ నాయకుడని, దేశం కోసం, రాష్ట్రం కోసం సేవలు చేసిన కుటుంబమని, తెలంగాణ రాష్ట్రం కోసం సర్వస్వం త్యాగం చేసిన త్యాగమూర్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. అదే విధంగా బడుగు, బలహీనవర్గాల దళిత వర్గాల ఉన్నతికి కృషి చేసిన బహుజన నాయకుడని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారు కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతీపితగా ప్రస్తుతించినందున బహుజన వర్గాల తరుపున కృతజ్ఞతలు, ధన్యవాదాలు అని అన్నారు. తెలంగాణ జాతీపిత గా అధికారికంగా ప్రకటించాలని కోరారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాల వద్ద బడుగు, బలహీనవర్గాలు, దళిత వర్గాల ప్రజలు, నాయకులు నివాళులు అర్పించి, జాతిపితగా ప్రకటించాలని కోరాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, రాష్ట్ర నాయకులు ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, డాక్టర్ మేడారపు సుధాకర్, చిప్ప వెంకటేశ్వర్లు, మార్గం ఎల్లయ్య, బైరి శ్యామ్ సుందర్, సంపత్, శ్రీనివాస్, నిరంజన్, పాము రాజు తదితరులు పాల్గొన్నారు.



# టీడబ్ల్యూజేఏ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రవీందర్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీడబ్ల్యూ జేఏ) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా డెస్క్ జర్నలిస్టు ఇస్లావత్ రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హనుమకొండ హరిత హోటల్ లో జరిగిన సంఘం 2వ రాష్ట్ర మహాసభలో జరిగిన నూతన కమిటీ ఎన్నికలో రవీందర్ ను మహాసభ ప్రతినిధులు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రవీందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. సమాజంలో గిరిజన జర్నలిస్టులు వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో గిరిజన జర్నలిస్టులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. తనను ఎన్నుకున్న ప్రతినిధులకు, తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నకు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్ నాయక్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- జూన్ 6 నాటికి నిర్మాణాలు ప్రారంభం కావాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** జిల్లాలో లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతంగా చేపట్టే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్లు, లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, టూబీహెచ్ కే ఇండ్లు, తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యువ వికాసం పథకంపై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ డిఈ సిద్ధార్థ నాయక్, ఆయా మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతికి సంబంధించిన వివరాలను ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో మొదటి దశలో రూ.50 వేలు, రూ.లక్ష లోపు రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికను జూన్ 9 నాటికి పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మండల స్థాయిలో పూర్తి చేసిన తర్వాత ఆ జాబితాను సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం జిల్లా ఇంచార్జి మంత్రికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించి పైలెట్ గ్రామాలలో ప్రారంభమైన ఇండ్ల నిర్మాణాల పనులను వేగంగా పూర్తయ్యేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా ఇంచార్జి అదనపు కలెక్టర్లు వై వి గణేష్, మేన శ్రీను, పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఇతర జిల్లా అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎంలు పాల్గొన్నారు.



# విద్యుత్ సబ్ స్టేషన్ పరిశీలన

**వరంగల్ వాయిస్, దామెర:** దామెర మండలంలోని సింగరాజు పల్లిలో గల 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ ను ఎన్ పీడీసీఎల్, కన్స్ట్రక్షన్ డివిజనల్ ఇంజినీర్ దర్శన్ కుమార్, పరకాల ఏడీఈ జే.దేవేందర్ సందర్శించి విద్యుత్ సరఫరా తీరును పరికరాల పనితీరును పరిశీలించారు. ఈ నేపథ్యంలో సబ్ స్టేషన్ లో గల పనిచేయని బ్రేకర్లను సిబ్బందితో రిపేరు చేయించారు. అనంతరం వాటర్ ట్రీట్ మెంట్ ప్లాం ట్ లో గల ట్రాన్స్ ఫార్మర్ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దామెర ఏఈ గుర్రం రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం

**పోలీసు, వ్యవసాయ శాఖల అధికారుల హెచ్చరిక**

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** నకిలీ విత్తనాలను, ఎరువులను అమ్మినట్లయితే పీడి యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని సీఐ ఆర్.సంతోష్ వ్యవసాయ శాఖ అధికారి యాదగిరి హెచ్చరికలు జారీ చేశారు. శనివారం ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు గూడెప్పాడు గ్రామాల్లో ఫర్టిలైజర్ అండ్ సీడ్స్ షాపులను వ్యవసాయ శాఖ పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఆర్ సంతోష్, ఏవో యాదగిరి మాట్లాడుతూ విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసినట్లయితే తప్పనిసరిగా రసీదు పొందాలన్నారు. పంట పూర్తి అయ్యేవరకు రసీదును తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. విత్తనాలు ఎరువులు ఆథరైజ్డ్ డీలర్ వద్దనే కొనుగోలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, కాల పరిమితి దాటిన విత్తనాలు గాని, ఎరువులు గాని విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఫర్టిలైజర్ షాప్ యజమానులు అధిక ధరలకు విత్తనాలమ్మినట్లయితే కేసులు నమోదు చేసి షాపులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు షాపుల్లోని స్టాక్ రికార్డులను, బిల్ బుక్ లను, షాప్ లైసెన్సులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఎంఏఓ తో పాటు ఎస్సై తిరుపతి, వ్యవసాయ శాఖ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదకరం

- దేశ సంపద అంబానీ, ఆదానీల వద్ద కేంద్రీకృతం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** మోడీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగి పోయారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. వరంగల్ నగరంలోని తమ్మెర భవన్ శివనగర్ లో శనివారం సీపీఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గన్నారపు రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రధాని మోడీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని అన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బీజేపీ యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు. వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు ఆర్థిక సాంఘిక రాజకీయ ఉద్యోగ కాంట్రాక్టు రంగాలలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో చత్తీస్ ఘడ్ లో విప్లవ కారులను ఎన్ కౌంటర్ ల పేరుతో హననం చేయడాన్ని ఆపి శాంతి చర్చలు చేయాలని హితువు పలికారు. దేశంలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వీరోచిత విప్లవాల చరిత్ర కలిగిన శ్రమ జీవుల పార్టీ సీపీఐ అన్నారు.

**జూలై 30, 31న వరంగల్ జిల్లా మహాసభ**

**సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి**

జూలై 30, 31 తేదీల్లో వరంగల్ లో నిర్వహించనున్న సీపీఐ వరంగల్ జిల్లా సదస్సును మహాసభను చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి విజ్ఞప్తి చేశారు. జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ కె బాష్ మియా, పనాస ప్రసాద్, జిల్లా నాయకులు దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, గుండె భద్రి, గుంపెల్లి మునీశ్వర్, వీరగోని శంకరయ్య, సంగి ఎలెంధర్, కందిక చెన్నకేశవులు, జన్ను రవి తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com